సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 27 । సెప్టెంబర్ । 2022

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



అరకులోయలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. 28 ఏకలవ్య పాఠశాలలకు చెందిన సుమారు 1680 మంది విద్యార్థులు పాల్గొనున్నారు. వీరిలో ప్రతిభ చూపిన 487 మందిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు

సాక్షి,పాడేరు : భూగర్భ జల, జలగణన శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాల నియామకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఆ శాఖ జిల్లా అధికారి మురళీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను పూర్తి చేసి అక్టోబర్ 5వ తేదీలోగా తమ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

శరవేగంగా జాతీయ రహదారి పనులు

పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్



పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్

అరకులోయ రూరల్: జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ తెలిపారు. మండలంలోని గద్యగుడ,కొత్తభల్లుగుడ, సుంకరమెట్ట గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. రైతులు నష్టపోతున్న భూములు,రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల ఏర్పాటుతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ఎన్‌హెచ్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు నష్టపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


రెండు సచివాలయాల సిబ్బందికి షోకాజ్ నోటీసులు



అమీనాబాద్ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్, వాతంగి సచివాలయాలకు చెందిన ఏడుగురు సిబ్బందికి ఎంపీడీవో కె.బాపన్నదొర షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన ఆ సచివాలయాలను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో అమీనాబాద్‌లో ముగ్గురు, వాతంగిలో నలుగురు సిబ్బంది గైర్హాజరయ్యారు. ఆగ్రహించిన ఎంపీడీవో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయా సచివాలయాల్లో జరిగిన స్పందన కార్యక్రమాల్లో పాల్గొని పరిస్థితిని సమీక్షించారు. భవన నిర్మాణాలను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు.

నిండుకుండలా జోలాపుట్టు జలాశయం



ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే ప్రధాన జోలాపుట్టు జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో నిండుకుండలా దర్శనమిస్తోంది. జలాశయం నీటి సామర్థ్యం 2,750 అడుగులు కాగా, మంగళవారం నాటికి 2,734.20 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే రోజు 2,727 అడుగుల నీరు నిల్వ ఉంది. గత ఏడాదితో పోలిస్తే 5 అడుగుల నీటి నిల్వ ఎక్కువగా ఉంది. మరో 10 అడుగుల నీటి నిల్వ పెరిగితే నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరుతుంది. మరో రెండు రోజులు విస్తారంగా వర్షాలు పడితే జలాశయ గేట్లు ఎత్తి దిగువనున్న డుడుమ జలాశయంలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉందని జలాశయ సిబ్బంది తెలిపారు.

మన్యం.. పర్యాటక స్వర్గధామం

- సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తున్న టూరిస్ట్ స్పాట్స్
- భారీ ఎత్తున అభివృద్ధి పనులు
- అరకులో టెథర్ గ్యాస్ బెలూన్ ప్రాజెక్ట్



బొర్రా గుహలు

సాక్షి, పాడేరు: కొండల మధ్య పాల సంద్రంలా తేలియాడే మేఘాలు...ఆకాశం నుంచి జాలువారుతున్నట్టు ఉండే పాల నురగల జలపాతాలు.. ఎటు చూసినా పచ్చని పొలాలు.. ఘాట్ రోడ్డు వెంబడి దట్టంగా ఉన్న అటవీ అందాలు.. సుమధుర స్వరంతో స్వాగతం పలుకుతున్నట్టు పక్షుల కిలకిలారావాలు.. అప్పుడప్పుడు పలకరిస్తూ రోడ్డుకు అడ్డంగా పరుగులు తీసే జంతువుల సందడి... అన్నింటికీ మించి మంచు అందాల సోయగాలు వెరసి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులకు భూతల స్వర్గంగా అలరారుతోంది అల్లూరి సీతారామరాజు జిల్లా. సందర్శకుల మనసు దోచే ఈ సౌందర్యసీమను పర్యాటకంలో అగ్రభాగాన నిలిపేందుకు కొత్త ప్రాజెక్టులెన్నో పట్టాలెక్కనున్నాయి. మన్యంలో పర్యాటకాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న పలు ప్రాంతాల్లో రూ.కోట్ల వ్యయంతో సౌకర్యాలు కల్పిస్తోంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ప్రపంచంలోని పలు దేశాలకు చెందిన టూరిస్టులు కూడా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తుంటారు. అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు పూర్వం నుంచి విశ్వవ్యాప్తి పొందగా గత రెండేళ్ల నుంచి పాడేరు మండలం వంజంగి హిల్స్ మేఘాల కొండగా ప్రపంచ పర్యాటక పుటల్లో ఎక్కింది. విశాఖ నుంచి అరకులోయ రైలు మార్గం కూడా పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటోంది. ఆంధ్రా ఊటీగా పేరొందిన అరకులోయ, పాడేరు మండలంలోని సముద్ర మట్టానికి సుమారు 4,500 అడుగుల ఎత్తులో ఉన్న డల్లాపల్లి కొండలు, చింతపల్లి మండలంలోని చెరువులవెనం కొండలు, తాజంగి రిజర్వాయర్, అత్యంత శీతల ప్రాంతమైన ఆంధ్రా కశ్మీర్ లంబసింగి, లంబసింగి ఘాట్ రోడ్డు, సీలేరు ఐస్ గెడ్డ జలపాతం, దారాలమ్మ ఘాట్‌రోడ్డు తదితర ప్రాంతాలు పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తున్నాయి.



విశ్వవ్యాప్తి పొందిన పాడేరు మండలంలోని వంజంగి హిల్స్‌అందాలు

జిల్లాలో విలీనమైన రంపచోడవరం డివిజన్ పరిధిలోని మోతుగూడెం, చింతూరు, మారేడుమిల్లి, దేవీపట్నం ప్రాంతాల్లో పలు జలపాతాలు, ప్రకృతి అందాలు, ఘాట్ రోడ్లు పర్యాటక ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. నవంబర్ నుంచి జనవరి వరకు వలిసెపూల అందాలు కూడా మన్యానికి మరో ఆకర్షణగా చెప్పవచ్చు. ఇక్కడ ప్రకృతి అందాల మధ్య సినిమా షూటింగ్‌లు కూడా అధికంగా జరుగుతుంటాయి. ఇంత ప్రకృతి రమణీయతకు పేరొందిన జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పాడేరు ఐటీడీఏ, టూరిజం శాఖలు కూడా కృషి చేస్తున్నాయి.

పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు

- టూరిజం ప్రాంతాలను అభివృద్ధి చేసి స్థానిక గిరిజన యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పాడేరు ఐటీడీఏ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంది. ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి భారీగాడ నిధులు కేటాయిస్తున్నారు.
- రూ.31లక్షల వ్యయంతో లంబసింగిలో ఐదు కాటేజీలు, ఫుడ్ కోర్టు నిర్మాణాలకు చర్యలు చేపట్టారు.
- చెరువుల వెనంలో రూ.20లక్షల ఎంపీ నిధులు, రూ.32లక్షల ఐటీడీఏ నిధులతో పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పన, వ్యూపాయింట్, రోడ్డు నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారు.
- చింతపల్లి హెచ్‌ఎన్‌టీసీలో స్ట్రాబెర్రీ, ఇతర ఉద్యానవన పంటల సాగు, పర్యాటకుల సందర్శనకు ఏర్పాట్లు చేశారు.
- తాజంగి రిజర్వాయర్‌లో రూ.6లక్షలతో బోట్లు ఏర్పాటు చేస్తున్నారు.
- కొత్తపల్లి జలపాతంలో రూ.10లక్షలతో అదనంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.
- వంజంగి హిల్స్‌లో అత్యవసర మౌలిక సదుపాయాలకు రూ.10లక్షలు మంజూరు చేశారు. మరో రూ.78లక్షలతో అభివృద్ధి పనులకు అంచనాలు తయారు చేశారు.
- అత్యంత ఎత్తులో ఉన్న పెదబయలు మండలం ఎంగ్రిక్ పర్వతం, హుకుంపేట మండలం సీతమ్మ కొండలపై పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు.
- ముంచంగిపుట్టు మండలం సుజనకోటలో రూ.35లక్షలతో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు.
- అరకు గిరిజన మ్యూజియంలో సుమారు రూ.కోటితో పర్యాటకులకుసౌకర్యాలు, మ్యూజియం అభివృద్ధి పనులు నిర్వహించనున్నారు.
- చాపరాయి జలపాతం వద్ద రూ.25లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. బ్యూటిఫికేషన్, విద్యుత్ లైనింగ్, సైక్లింగ్‌కు రూ.48లక్షలు మంజూరు చేశారు.
- కొత్తవలస హెచ్‌ఎన్‌టీసీలో రూ.78లక్షలతో కాటేజీలు నిర్మాణం, మెడిసిన్ ప్లాంటేషన్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.
- పద్మాపురం గార్డెన్‌లో రూ.54లక్షల వ్యయంతో మూడు అధునాతన హట్‌ల నిర్మాణం, ఇతర సౌకర్యాల కల్పనకు మరో రూ.9లక్షలు మంజూరు చేశారు.
- కటికి జలపాతంలో టాయ్‌లెట్లు, ఇతర సౌకర్యాలకు రూ.10లక్షలు మంజూరు చేశారు.
- పర్యాటక అభివృద్ధితో స్థానిక గిరిజనులకు ఉపాధి కల్పనకు చర్యలు చేపడుతున్నారు.

అరకు అందాల్లో తేలినట్టుందే..

అడ్వెంచర్ టూరిజంని కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రకృతి అందాలకు నిలయంగా.. అంతర్జాతీయ టూరిస్టుల్ని ఆకర్షిస్తున్న మన్యం అడ్వెంచర్ టూరిజంకి కేంద్రంగా మారనుంది. ఇందులో భాగంగా అరకులోయలో టెథర్డ్ గ్యాస్ బెలూన్ ప్రాజెక్టు రానుంది. ఫ్రాన్స్‌కు చెందిన ఏరో ఫైల్ సంస్థ దీనికి ఆసక్తి చూపిస్తున్నట్లు ప్రకటించింది. ఒకేసారి 30 మంది గాల్లో విహరించే సామర్థ్యం ఉన్న బెలూన్‌లో పర్యాటకులు విహరించేలా ప్రాజెక్టు పట్టాలెక్కనుంది ఇలా.. సరికొత్త పర్యాటకాన్ని విశాఖ వచ్చే టూరిస్టులకు పరిచయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమై.. రిక్రియేషన్ ప్రాజెక్టులు వీలైనంత త్వరగా పట్టాలెక్కించేందుకు ఏపీటీడీసీ అధికారులు సమాయత్తమవుతున్నారు.



అనంతగిరి మండలంలోని కటికి జలపాతం

భారీగా ఐటీడీఏ నిధులు



పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటకులకు అవసరమయ్యే సౌకర్యాలు కల్పించేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ పనులు చేపడుతున్నాం. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానిక గిరిజనులకే ఉపాధి కల్పిస్తున్నాం. ఎకో టూరిజం ప్రాజెక్టుల ద్వారా స్థానిక గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్నాయి. వంజంగి హిల్స్‌ను అభివృద్ధి చేసి పర్యాటకుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కొంత పంచాయతీల అభివృద్ధికి కేటాయిస్తాం. ప్రస్తుతం అన్ని పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల పనులు, కాటేజీల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. నవంబర్ మొదటి వారానికి పర్యాటక ప్రాంతాలన్ని మౌలిక సదుపాయాలతో పర్యాటకులను మరింత ఆకట్టుకుంటాయి.

– ఆర్.గోపాలకృష్ణ, ఐటీడీఏ పీవో, పాడేరు.

ఆస్పత్రుల అభివృద్ధి పనులపై తప్పుడు నివేదికలు

తగదంటూ అధికారులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు : నాడు–నేడులో చేపట్టిన ఆస్పత్రుల అభివృద్ధి పనులపై తప్పుడు నివేదికలు ఇస్తూ ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేయకుండానే పూర్తయినట్టు నివేదికలు ఇవ్వడం తగదని, పనులు సక్రమంగా పూర్తి చేయని పక్షంలో చర్యలు తప్పవని ఆర్‌అండ్‌బీ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 పీహెచ్‌సీల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయని, విద్యుత్ సదుపాయం కల్పించి బిల్లులు అప్‌లోడ్ చేయలేదని, ఇన్వర్టర్లు ఏర్పాటు చేయలేదని, టాయ్‌లెట్లకు అవుట్‌లెట్లు పనులు కూడా జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేయకపోవడంపై మందలించారు. ఆస్పత్రుల అభివృద్ధి పనుల లోపాలను ఇంజినీరింగ్ చీఫ్‌కు, ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తానని కలెక్టర్ హెచ్చరించారు. కాంట్రాక్టర్లు ఈ పనులకు ముందుకు రాకపోతే ప్రైవేటు వ్యక్తులతో పనులు పూర్తి చేయించాలని, బిల్లులు అప్‌లోడ్ చేసిన వెంటనే నగదు చెల్లిస్తామని తెలిపారు. 85 రోజుల క్రితం రూడకోట, ఈదులపాలెం ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి, పెండింగ్ పనుల గురించి ఆయా అధికారులకు స్వయంగా ఫోన్లో చెప్పినా, ఇంత వరకు పూర్తి చేయలేదని ఆగ్రహించారు. జి.కె.వీధి పీహెచ్‌సీ పనుల ప్రగతిపై వైద్యులతో మాట్లాడారు. అక్కడ వారం రోజుల్లోగా ఇన్వర్టర్ ఏర్పాటు చేయని పక్షంలో ఏఈఈపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పినకోట పీహెచ్‌సీలో పనులు వేగవంతం చేయాలని ఆదేశించినా పెండింగ్‌లో ఉండడాన్ని కలెక్టర్ తప్పుపట్టారు. తరచూ ఆయా ప్రాంతాలను సందర్శించి పనులపై సమీక్షించాలని, దిగువ స్థాయి ఇంజినీరింగ్ అధికారులకు తగిన సూచనలు కూడా జారీ చేయాలని విశాఖపట్నం పర్యవేక్ష ఇంజినీర్‌కు ఫోన్ చేసి ఆదేశించారు. విధులు సక్రమంగా నిర్వహించకుండా తప్పుడు నివేదికలు అందజేస్తే దూర ప్రాంతాలకు బదిలీలపై పంపించి, తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పనులు నిర్వహించని కారణంగా పీహెచ్‌సీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సంబంధిత ఇంజినీరే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సుజాత, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో దేవుడా..

- సోకులేరు వాగులో కొట్టుకుపోయి ముగ్గురు విద్యార్థినులు మృతి
- మృతులు బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన వారు
- గుండెలవిసేలా రోదించిన తోటి విద్యార్థులు
- ఐదు రోజుల విహార యాత్రలో రెండో రోజే విషాదం

అంతవరకు వారు ఆటపాటలతో చాలా సంతోషంగా గడిపారు.. భద్రాచలంలో ముందు రోజు సందర్శించిన రామాలయం, పర్ణశాల గురించి కలబోసుకున్నారు.. ఇంటికి వెళ్లి తమ యాత్ర గురించి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు గొప్పగా వివరించాలని భావించారు..ఇంతలోనే విధికి కన్నుకుట్టింది... వాగు రూపంలో ముగ్గురు విద్యార్థినులను కబళించింది. తోటి విద్యార్థులను శోకసంద్రంలో ముంచేసింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. విహార యాత్ర విషాద యాత్రగా మారింది.



వాగు నుంచి మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న పోలీసులు







విద్యార్థినుల మృతదేహాలు



ప్రమాదానికి ముందు తీసుకున్న ఫొటో



సంఘటనా స్థలం వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్తిబాబు

మోతుగూడెం/చింతూరు: బాపట్ల జిల్లా వేటపాలెంలోని శ్రీహనుజ్జ పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థినులు, 14 మంది విద్యార్థులు, ప్రిన్సిపాల్, ముగ్గురు ఉపాధ్యాయులు, పిల్లల బంధువులు ఒక కారు, ఒక వ్యాన్‌లో ఐదు రోజుల విహార యాత్రకు ఈనెల 25వ తేదీ ఉదయం బయలు దేరారు. భద్రాచలంలో సాయంత్రం రామాలయాన్ని సందర్శించి, దైవ దర్శనం చేసుకున్నారు. అక్కడ నుంచి పర్ణశాల తదితర ప్రాంతాలను సందర్శించి రాత్రి భద్రాచలంలోనే బస చేశారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు చింతూరు చేరుకుని అల్పాహారం ముగించి, లక్కవరం సమీపంలోని సోకులేరు వ్యూపాయింట్‌కు బయలుదేరారు. వ్యూపాయింట్ వద్ద వాహనాలు నిలిపి, విద్యార్థులు సోకులేరు వాగు ఒడ్డుకు వెళ్లారు. వాగులో దిగిన వారిలో పదో తరగతి విద్యార్థినులు సువర్ల కమల(15), సూరిన గీతాంజలి(14), గుమ్మడి జయశ్రీ (15) కొట్టుకుపోయారు. అక్కడ ఉన్న వారు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ ప్రాంతంలో తోటి విద్యార్థుల రోదనలు మిన్నంటాయి. అంతవరకు తమతో సరదా గడిపిన స్నేహితులు అంతలోనే విగతజీవులుగా మారడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం తెలుసుకున్న మోతుగూడెం ఎస్‌ఐ సత్తిబాబు తమ సిబ్బందితో సహా ఆ ప్రాంతానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో సువర్ల కమల తండ్రి ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు పిల్లలు. సూరిన గీతాంజలి తండ్రి వంట పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మృతురాలు ఒక్కరే సంతానం. గమ్మడి జయశ్రీ తండ్రి క్రేన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు. చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ అప్పలనాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

విషాదంగా మిగులుతున్న విహార యాత్రలు

ప్రకృతి అందాలకు పుట్టినిల్లయిన మన్యంలో విహార యాత్రలు విషాదంగా మిగులుతున్నాయి. ఉల్లాసంగా గడిపేందుకు వస్తున్న పర్యాటకులు ప్రమాదాలు బారిన పడి, తల్లిదండ్రుకు వారికి కడుపకోత మిగుల్చుతున్నారు. ఏజెన్సీలో ఏడాది కాలంలో వివిధ జలపాతాలు, సెలయేళ్లలో పడి 14 మంది మృతి చెందారు. తాజాగా సోమవారం బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన ముగ్గురు పదో తరగతి విద్యార్థినులు సోకులేరు వాగులో మునిగి మృత్యువాత పడ్డారు. భద్రాచలం రామాలయాన్ని సందర్శించుకుని మారేడుమిల్లి, అన్నవరం, విశాఖపట్నం, అరకు అందాలను తిలకించి ఈ 29న ముగించాలనుకున్నారు. రెండో రోజే వారి ప్రయాణంలో విషాదం చోటుచేసుకుంది.

మాతాశిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు

పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు : మాతాశిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాల సేవల విస్తరణకు సంబంధించి ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం ఐసీడీఎస్ అధికారులు, ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గ్రామాల్లోని ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమన్వయం చేసుకుని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య ఆరోగ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలని, నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీని చేపట్టాలని ఆదేశించారు. నెలలు నిండిన గర్భిణులను గుర్తించి ముందుగానే ఆస్పత్రులకు తరలించి సుఖ ప్రసవాలకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. తల్లీబిడ్డల క్షేమమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మాతాశిశు మరణాలు జరిగితే ఉపేక్షించేది లేదని, అందుకు గల కారణాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. సూపర్‌వైజర్లు వారానికి ఐదు రోజులు క్షేత్రస్థాయి పర్యటన చేసి, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. కేజీబీవీలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సీడీపీవోలు, సూపర్‌వైజర్లు సందర్శించి బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలు జరగకుండా గ్రామకమిటీల సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించాలని, రక్తహీనత, ఇతర సమస్యలతో బాధపడే చిన్నారులకు అదనపు పోషకాహారం అందించాలని, పిల్లలకు పాలు పట్టే విధానంపై బాలింతలకు అవగాహన కల్పించాలని పీవో సూచించారు.

భవన నిర్మాణాలు వేగవంతం

అంగన్‌వాడీ భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పీవో ఆదేశించారు. 130 అంగన్‌వాడీ భవనాలను నాడు–నేడు కార్యక్రమంలో నిర్మిస్తున్నామని, 97 భవనాలకు రూ.221.68లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. ఇప్పటికి రూ.41.16లక్షలు మాత్రమే ఖర్చు చేశారని, మిగిలిన పనులన్నింటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ భవనాలన్నీ ఒకే విధంగా నిర్మించాలని, సీడీపీవోలు, సూపర్‌వైజర్లంతా ఈ భవన నిర్మాణాలను ప్రతిరోజు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎం.సూర్యకళ, గిరిజన సంక్షేమ పాడేరు, అరకు ఈఈలు డీవీఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

‘స్పందన’ సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను పీవో సూరజ్ గనోరేకు వివరిస్తున్న ఎంపీపీ బందం శ్రీదేవి

రంపచోడవరం: స్పందనలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో పీవో సూరజ్ గనోరే,సబ్ కలెక్టర కట్టా సింహాచలంలు అధికారులను ఆదేశించారు.స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో సోమవారం పీవో సూరజ్ గనోరే,సబ్ కలెక్టర కట్టా సింహాచలం స్పందన కార్యక్రమం నిర్వహించారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి మండలంలో పలు సమస్యలు పరిష్కారం కోసం పీవో దృష్టికి తీసుకువెళ్లారు. భూపతి పాలెం ప్రాజెక్టు పాతగాంధీనగరం వద్ద గల కాలువపై వంతెన నిర్మించాలని కోరారు. వేములకొండ పంచాయతీలో మెడికల్ క్యాంప్ నిర్వహించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీపీతో ఎంపీటీసీలు తుర్రం వెంకటేశ్వర్లుదొర, నర్రి పాపారావు, వంశీ కుంజం, సర్పంచ్‌లు కొమరం పండుదొర, కత్తుల వరలక్ష్మి, గుడి చైర్మన్ బొబ్బా శేఖర్, మాజీ ఎంపీటీసీ వీరయమ్మలు ఉన్నారు. భూపతిపాలెం ప్రాజెక్టు నిర్వాసితులకు 2004 ఒప్పందం ప్రకారం రెండు ఎకరాలు భూమి ఇవ్వాలని బూసిగూడెం సర్పంచ్ పల్లాల ఆదిలక్ష్మి, పల్లాల లచ్చిరెడ్డిలు, ఇళ్ల జోగిరెడ్డిలు కోరారు. మారేడుమిల్లి మండలం మామిడి వలస గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా సాగులో ఉన్న భూములకు అటవీ హక్కుల చట్టం ద్వారా పట్టాలు మంజూరు చేయాలని మడకం చెల్లయమ్మ, ముచ్చిక బుల్లిదొరలు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, ఈఈ డేవిడ్‌రాజ్. జీసీసీ ఎండి యూసఫ్, వెలుగు ఏపీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీదేవిపేట అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై విచారణ


విచారణ చేస్తున్న ఏడీఏ ప్రతాప్‌జీవన్

ఎటపాక: ట్రాక్టర్ ఇప్పిస్తానని చెప్పి రైతును మోసం చేశాడన్న ఫిర్యాదుపై గౌరీదేవిపేట ఆర్బీకే అగ్రికల్చర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యంపై వ్యవసాయశాఖ అధికారులు సోమవారం విచారణ జరిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ట్రాక్టర్ ఇప్పిస్తానని చెప్పి నందిగామ గ్రామానికి చెందిన యాలం పెదవెంకటేశ్వర్లు అనే రైతు నుంచి సుబ్రహ్మణ్యం రూ.5.29 లక్షలు తీసుకున్నాడు. ట్రాక్టర్ ఇవ్వకపోవడంతో తన సొమ్ము వెనక్కి ఇచ్చేయాలని చాలా సార్లు రైతు కోరాడు. దీంతో సుబ్రహ్మణం రూ.2 లక్షలు వెనక్కి ఇచ్చాడు. దీనిపై మండల వ్యవసాయశాఖ ఏవో రాబిన్‌సుదర్శన్‌కు ఇటీవల రైతు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఏడీఏ ప్రతాప్‌జీవన్ సోమవారం గౌరీదేవిపేటలో విచారణ జరిపారు. రైతు వద్ద సుబ్రహ్మణ్యం డబ్బులు తీసుకున్నట్టు నిర్ధారణ కావడంతో నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. త్వరలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోనున్నట్టు ఏవో తెలిపారు.

తీవ్ర రక్తస్రావంతో గర్భిణి మృతి

పాడేరు రూరల్: ప్రసవం కోసం పాడేరు జిల్లా ఆస్పత్రి గైనిక్ విభాగంలో చేరిన ఓ నిండు గర్భిణి సోమవారం రాత్రి మృత్యువాత పడింది. జి.మాడుగుల మండలం తగ్గిమెట్ట గ్రామానికి చెందిన పద్మావతి అనే గిరిజన మహిళకు నెలలు నిండటంతో మొదటి కాన్పు కోసం ఆదివారం సాయంత్రం ఆమెను పాడేరు జిల్లా ఆస్పత్రి గైనిక్ విభాగంలో చేర్చారు. ఉన్నట్టుండి తీవ్ర రక్తస్రావం కావడంతో కడుపులో బిడ్డ ఉండగానే సోమవారం రాత్రి మృతి చెందింది. మృతదేహాన్ని ఆస్పత్రి అంబులెన్స్‌లో కుటుంబ సభ్యులు తమ స్వగ్రామానికి తరలించారు.

తూర్పు కనుమల్లో రంగురాళ్ల తవ్వకాలు

- రక్షిత అటవీ ప్రాంతాల్లో విచ్చలవిడిగా తవ్వకాలు
- నిరోధానికి బృందాలుగా కాపలా


ప్లాంటేషన్ క్వారీలో అటవీ సిబ్బంది మూసివేసిన క్వారీ


పెన్సిల్ క్వారీలో రంగురాళ్ల తవ్వకాల్లో ఏర్పడిన సొరంగం

అడ్డతీగల: తూర్పు కనుమల్లో రంగురాళ్ల తవ్వకాలు మళ్లీ ఊపందుకున్నాయి. రక్షిత అటవీ ప్రాంతాల్లో విలువైన రంగురాళ్ల కోసం అన్వేషిస్తూ విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు గ్రామాల్లోని గిరిజన యువతను ప్రలోబపెట్టి పెట్టుబడి పెట్టి మరీ తవ్వకాలకు ఉసిగొల్పుతున్నారు. తవ్వకాలకు పరికరాలు కొనిచ్చి దాంతో పాటు మద్యం ఇతరత్రా వంట సామగ్రిని ఇచ్చి మరీ తవ్వకాలకు పంపిస్తున్నట్టు సమాచారం. చాలా కాలంగా ఈ రంగురాళ్ల వ్యాపారంలో ఉన్నవారే ఈ విధానానికి పూనుకుంటున్నారు. గత కొన్నాళ్లుగా స్తబ్దంగా ఉన్న రంగురాళ్ల అన్వేషణ కాస్తా ఇటీవల కొన్నిరోజులుగా మళ్లీ మొదలైంది.

క్వారీల్లో భారీగా మట్టి తొలగింపు

1994 కాలంలో అడ్డతీగల అటవీక్షేత్రం పరిధిలోని తపస్వికొండ రక్షిత అటవీ ప్రాంతంలో ఈ రంగురాళ్లు బయల్పడిన నాటి నుంచి అనేకసార్లు విచ్చలవిడిగా తవ్వకాలతో మట్టిపెళ్లలు విరిగిపడిన దుర్ఘటనల్లో పలువురు గిరిజనులు దుర్మరణాలు చెందారు. అయినప్పటికీ మళ్లీ అదే పనిగా తవ్వకాలకు వ్యాపారులు ఉసిగొల్పుతున్నారు. రక్షిత అటవీ ప్రాంతంలో ఇటీవల గ్రావెల్ తవ్వకాల్లో రంగురాళ్లు బయటపడి, లక్షల్లో వ్యాపారం జరిగిందని పలువురు చెబుతున్నారు. తపస్వికొండ రక్షిత అటవీ ప్రాంతంలోని నిమ్మలపాలెం, దుప్పులపాలెం, మల్లవరం మామిళ్లు, దాకోడు, పైడిపుట్ట పరిసర ప్రాంతాల్లో రంగురాళ్ల సేకరణ కోసం ప్లాంటేషన్ క్వారీ, తిరుతమ్మ క్వారీ, బిళ్లమాను క్వారీ, పెన్సిల్ క్వారీల నుంచి భారీగా మట్టి తీసినట్టు సమాచారం.

తవ్వకాల నిరోధానికి పటిష్ట చర్యలు

తపస్వికొండ రక్షిత అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాల నిరోధానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు అడ్డతీగల అటవీక్షేత్రాధికారి బి.లలితకుమారి చెప్పారు. ఈ మేరకు తవ్వకాలు జరుగుతున్నట్టు సమాచారం ఉన్న ప్రతిచోట బేస్‌క్యాంపునకు చెందిన ఇద్దరు మరొక అటవీ ఉద్యోగితో నిరంతరం కాపలా పెట్టామన్నారు. ఆయా సెక్షన్‌ల డీఆర్వోలు ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించేలా చూస్తున్నామన్నారు. గ్రామాల నుంచి ఎవరైనా తవ్వకాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులకు ఇప్పటికే ఈ విషయం తెలియజేసి గ్రామాల నుంచి ప్రజలు తవ్వకాలకు వెళ్లకుండా చూడాలని కోరామన్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

ఇంట్లో నిద్రిస్తుండగా కాటేసిన పాము

ఉపాధ్యాయుడి మృతి


విశ్వనాథం నాయుడు(ఫైల్)

పాడేరు రూరల్ : ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటేయంతో ఓ ఉపాధ్యాయుడు మృత్యువాత పడ్డారు. హుంకుంపేట మండలం మఠం గ్రామానికి చెందిన మఠం విశ్వనాథం నాయుడు అదే మండలంలోని కోడెలి ఎంపీయూపీ పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి మఠం గ్రామంలోని తన ఇంటి వద్ద ఆయనను పాము కాటేసింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున ఆయన మృతి చెందారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు, ఉపాధ్యాయుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించడంతో మఠం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

గుట్టుగా రంగురాళ్ల తవ్వకాలు


కూటికుండలు ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలు చేస్తున్న దృశ్యం

జి.మాడుగుల : మండలంలో గడుతూరు పంచాయతీ కూటికుండలు గ్రామ శివారున కొన్ని రోజుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయి. నర్సీపట్నం, రావికమతం, దిబ్బలూరుకు చెందిన కొంతమంది వ్యాపారులు కలసి జి.మాడుగుల మండలానికి చెందిన వసమామిడి, జర్రాయి, నెయ్యలబంద, సీతబంద గ్రామాలకు చెందిన అమాయకులైన గిరిజనులను ప్రోత్సహించి రంగురాళ్లు తవ్విస్తున్నట్టు తెలుస్తోంది. రంగురాళ్ల అన్వేషణ కోసం తీసిన గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏక్షణాన్నయినా గోతులు కూలినా ప్రాణ నష్టం జరిగే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెప్పారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


పాడేరులోని దుర్గమ్మను దర్శించుకున్న మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు, భక్తులు

సాక్షి,పాడేరు : జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పాడేరులోని ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్డులోని దుర్గమ్మతల్లి గుడివద్ద నవరాత్రి ఉత్సవాలను ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు తొలిపూజ చేసి ప్రారంభించారు. నడిమివీధి, ఇరడాపల్లి గ్రామాల్లో గిరిజనులు నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాడేరు, దారెల సర్పంచులు కొట్టగుల్లి ఉషారాణి, పాండురంగస్వామిఉప సర్పంచ్ బూరెడ్డి రాము, ఉత్సవ కమిటీ అధ్యక్షులు వియ్యపు వెంకట్, ఇతర ప్రతినిధులు కొట్టగుల్లి సుబ్బారావు, భవానిరాము, దామోదుల జగన్, డొంకిని నాగు, బండారు బుజ్జి, గెంజి రమణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే హుకుంపేట, సూకూరు గ్రామాల్లోను దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తులు ప్రారంభించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్ : మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 3768 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మూడో విడత వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.7,06,50,000 మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. పేద మహిళలు చిరు వ్యాపారాల ద్వారా వారి జీవితాలను మెరుగుపర్చుకోవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశారన్నారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటపై నిలబడి డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేశారని, మహిళల అభ్యున్నతి కోసం విశేష కృషి చేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. పాడేరులో వైఎస్సార్ మెడికల్ కళాశాల, చింతపల్లిలో వంద పడకల ఆస్పత్రి, ఇతర సంక్షేమ పథకాలు గిరిజన ప్రాంత అభివృద్ధిని చూపిస్తున్నాయన్నారు. పార్టీలకతీతంగా వైఎస్సార్ చేయూత పథకం అమలు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలత, ఎంపీడీవో సీతయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు అనూషదేవి, దారలక్ష్మి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణలో అప్రమత్తం


సిబ్బందితో మాట్లాడుతున్న సీసీఎఫ్ శరవణన్, డీఎఫ్‌వో రాజు తదితరులు

చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవణన్

అడ్డతీగల: అడవుల సంరక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవణన్ అన్నారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అటవీశాఖాధికారి ఐ.కె.వి.రాజుతో కలసి సీసీఎఫ్ సోమవారం అడ్డతీగల అటవీక్షేత్రాధికారి కార్యాలయాన్ని సందర్శించారు. కొద్దిసేపు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కలప స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలను నిరోధించడానికి అనుసరించవలసిన చర్యల గురించి వివరించారు. అటవీశాఖ సబ్‌డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు ఏ భవనం బాగుంటుందో చర్చించారు.ఈ కార్యక్రమంలో అడ్డతీగల అటవీక్షేత్రాధికారి డి.లలితకుమారి,సెక్షన్ అధికార్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా లంపి వ్యాధి నివారణ టీకాలు

- ఒక పశువుకు సోకిన వ్యాధి
- అప్రమత్తమైన అధికారులు
- 250 పశువులకు టీకాలు


కొరవంగిలో లంపి వ్యాధి సోకిన పశువును పరిశీలిస్తున్న ఏడీ రాజరవికుమార్

పెదబయలు: ఏజెన్సీలో లంపి స్కిన్ వ్యాధి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం విస్తృతంగా శిబిరాలు నిర్వహించి పశువులకు టీకాలు వేస్తున్నట్టు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రాజా రవికుమార్ చెప్పారు. పెదబయలు మండలం రూడకోట గ్రామ సచివాలయం పరిధిలోని కొరవంగి పంచాయతీలో లంపి స్కిన్ వ్యాధి సోకినట్టు పాడి రైతు కొరవంగి మాధవరావు ఫిర్యాదు మేరకు సోమవారం కొరవంగి గ్రామాన్ని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రాజా రవికుమార్, సిబ్బంది సందర్శించారు. కొరవంగితో పాటు సుమారు 5 కిలోమీటర్ల పరిధిలోని పరిసర గ్రామాల్లోని సుమారు 250 పశువులకు లంపి స్కిన్ వ్యాధి టీకాలు, మేకలు, గొర్రెల నట్టల నివారణ వ్యాక్సిన్ వేసినట్టు డాక్టర్ రాజారవికుమార్ చెప్పారు. ఈ మేరకు ప్రత్యేకంగా మూడు టీంలు ఏర్పాటుచేశామన్నారు. పశువులకు చర్మంపై పొక్కులు వచ్చినట్టు రైతులు గుర్తిస్తే వెంటనే గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌కు సమాచారం అందించాలని, తక్షణమే వైద్య సేవలందిస్తారన్నారు. లంపి వ్యాధి త్వరితగతిన సోకే ప్రమాదముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి సోకిన పశువును మంద నుంచి దూరంగా ఉంచాలని సూచించారు. అయితే కొరవంగిలో ఒక్క ఎద్దుకు మాత్రమే వ్యాధి లక్షణాలు ఉందని, మిగిలిన పశువులకు లేదని, ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో అన్ని పశువులకు టీకాలు వేసినట్టు చెప్పారు. ఒడిశా, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన పశువుల నుంచి ఈ వ్యాధి వ్యాపించే అవకాశాలున్నాయన్నారు. పశువుల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, టీకాలు వేయించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఆశ కార్యకర్త మృతి


హిందు (ఫైల్)

పాడేరు రూరల్ : ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడి ఓ ఆశ కార్యకర్త మృతి చెందింది. పెదబయలు మండలం బొండాపల్లి పంచాయతీ గోడిపుట్టు గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త కొర్రా హిందు అదే గ్రామానికి చెందిన తన కుటుంబ సభ్యుడైన రంగారావు అనే వ్యక్తితో కలిసి సోమవారం పెదబయలు వచ్చారు. బ్యాంకు పనులు ముగించుకొని అతనితో కలిసి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా పెదబయలు మండలం సంపంగిపుట్టు–తమరాడ మార్గంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పింది. బైకు రోడ్డు అంచు కిందికి దిగడంతో బైక్ వెనుక కూర్చున్న హిందు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను సమీపంలో ఉన్న పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు.

రాష్ట్ర స్థాయి సాంస్కృతికోత్సవాల్లో సత్తాచాటిన గిరిపుత్రులు


అవార్డులు అందుకుంటున్న ముంచంగిపుట్టు ఏకలవ్య పాఠశాల విద్యార్థులు


ప్రశంసాపత్రాలతో తాళ్లపాలెం ఈఎంఆర్‌స్కూల్ విద్యార్థులు

ఓవరల్ చాంపియన్‌గా ముంచంగిపుట్టు విద్యార్థులు

పెదబయలు: ముంచంగిపుట్టు ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటారని ప్రిన్సిపాల్ పి.కేశవరావు చెప్పారు. నెల్లూరు జిల్లా చంద్రశేఖరపురంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సాంస్కృతికోత్సవాల్లో ముంచంగిపుట్టు ఏకలవ్య పాఠశాల నుంచి పోటీల్లో పాల్గొన్న డి.వంశీ ఆంగ్లం, హిందీ ఉపన్యాసాల్లో ప్రథమ బహుమతి, డి.వంశీ, కె.సంతోష్‌కుమార్ ఆంగ్లంలో చర్చకు ప్రథమ బహుమతి, క్విజ్, హిందీ చర్చ పోటీల్లో వంశీ, సంతోష్‌కుమార్ ద్వితీయ బహుమతి. హిందీలో సృజనాత్మక రచనకు ద్వితీయ బహుమతి సాధించినట్టు ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు. నాలుగు ప్రథమ, మూడు ద్వితీయ బహుమతులు సాధించారని. ఇద్దరు విద్యార్థులు ఏడు పోటీల్లో ప్రతిభ కనబర్చి ఓవరల్ చాంపియన్ షిప్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. వారికి అభినందనలు తెలిపారు.

రాజవొమ్మంగి: నెల్లూరులో ఇటీవల జరిగిన సాంస్కృతికోత్సవాలోలతాళ్లపాలెం ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు.విద్యార్థిని పి.గాయత్రి హిందీ ఉపన్యాసంలో మొదటి బహుమతి, పద్య పఠనంలో ద్వితీయ బహుమతి, డి.నిషిత శ్రీ సౌభాగ్య స్టోరీ టెల్లింగ్‌లో మొదటి బహుమతి పొందారు. అధ్యాపకులు అశోక్‌కుమార్, అనుషరీనా ఆధ్వర్యంలో విద్యార్థులతో వెంట వెళ్లారు. ఆయా విద్యార్థులకు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, స్థానికులు తదితరులు అభినందనలు తెలిపారు.

ఊపిరి అందక మూడు నెలల చిన్నారి మృతి

రాజవొమ్మంగి: ఊపిరి తీసుకోలేని స్థితిలో రాజవొమ్మంగి గ్రామానికి చెందిన మూడు నెలల పాప సోమవారం మరణించింది. ఈ విషయమై స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీదుర్గను వివరణ కోరగా, మూడు రోజుల కిందట పాలు సరిగా తాగడం లేదంటూ తల్లి సూలోజు సింహాద్రి తన కుమార్తెను పీహెచ్‌సీకు వచ్చిందని, వారిని అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశానని తెలిపారు. వారు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారని చెప్పారు.

పాప సోమవారం మరో సారి తీవ్ర అస్వస్థతకు గురికాగా తిరిగి పీహెచ్‌సీకు తీసుకు వచ్చారని తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆ పాపను కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశామని, అంబులెన్స్‌లో కాకినాడ తీసుకొని వెళుతుండగా మార్గమధ్యలో మరణించినట్టు డాక్టర్ శ్రీదుర్గ తెలిపారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు. చింతపల్లి పర్యటనలో భాగంగా ఆమె డౌనూరు ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. వైద్యులతో మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో విధిగా బ్లీచింగ్ పనులు చేయించాలన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.మర్రిపాలెం మహిళా డిగ్రీ కళాశాల సమీపంలో బస్‌షెల్టర్ కోసం మూలపేట సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి తదితరులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బస్‌షెల్టర్ కోసం నిధులు మంజూరు చేయిస్తున్నట్టు సర్పంచ్ చెప్పారు. సర్పంచ్ భవానీ, వైస్ సర్పంచ్ చంటి, బూత్ కమిటీ కన్వీనర్ పోతురాజు, నాయకులు కళ్యాణం, వెంకటరమణ, సత్తిబాబు తదితరులున్నారు.

సరకుల సరఫరాలో జాప్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ తిరుమలరావు

కొయ్యూరు: జీసీసీ బీఎం కార్యాలయంలో సోమవారం డీలర్లతో తహసీల్దార్ తిరుమలరావు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సరకుల సరఫరాలో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ పాయింట్ నుంచి డిపోలకు సకాలంలో సరకులను చేరవేసేలా చూడాలని గొడౌన్ పర్యవేక్షకుడు వీరభద్రానికి సూచించారు. యూ.చీడిపాలెం, ఎం.భీమవరం, పలకజీడి డిపోలకు సంబంధించి సరకులకు సంబంధించిన వివరాలు ఇవ్వడం లేదని, ఇకపై అలా చేస్తే జరిమానాతో పాటు చర్యలు తీసుకుంటామన్నారు. బియ్యం నిల్వ లేకపోయినా ఉన్నట్టు చూపిస్తున్నారని, దీంతో నష్టాలు ఎదుర్కొంటున్నామని పలువురు డీలర్లు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ అలాంటివి జరగకుండా సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే సరకులను వెంటనే సరఫరా చేసి, బయోమెట్రిక్‌ను సకాలంలో తీసుకోవాలన్నారు. జీసీసీ అకౌంటెంట్ రమణ ఉన్నారు

ఎంపీడీవోగా ఫణిదర్



వీఆర్‌పురం: వీఆర్‌పురం ఎంపీడీవోగా ఆర్.ఫణిధర్ నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగుతున్న ఏవో రత్నకుమారి నుంచి ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్ -1 కేడర్‌లో ఎంపికై తొలి పోస్టింగ్‌లో వీఆర్ పురం ఎంపీడీఓగా వచ్చినట్టు ఆయన చెప్పారు.

దుప్పట్లు, చీరల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కుమారి, ఎంపీడీవో ఉమామహేష్

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని పాత్రికేయుడు రాము ప్రథమ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు బృందం ఆధ్వర్యంలో దుప్పట్లు, చీరలను ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీడీవో ఉమామహేష్ పంపిణీ చేశారు. ఈవోపీఆర్డీ పాపారావు, సర్పంచ్ సుభద్ర, పాత్రికేయులు రమణ, లక్ష్మణ్, దారబాబు, చంటి, విజయ్, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



పైపులైన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ సీతమ్మ, నేతలు

ముంచంగిపుట్టు: పనసపుట్టు పంచాయతీ కదుతుల గ్రామంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ సోమవారం పర్యటించారు. గ్రామంలో నీటి సదుపాయం కోసం చేపడుతున్న పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు కమల, మాజీ సర్పంచ్ మూల్యా, నాయకులు భగత్‌రామ్, దేవా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు విశేష ఆదరణ

- ప్రజా సంక్షేమమే ధ్యేయం: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- అర్హులందరికీ పథకాలు: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



రారింతాడలో గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



పి.యర్రగొండలో గ్రామస్తులతో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతపల్లి రూరల్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్ట గుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కొమ్మంగి పంచాయతీ పరిధిలో రారింతాడ, గెంజిగెడ్డ, సల్లాయి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 230 గడపలను సందర్శించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి, ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా తదితర పథకాలను పార్టీలకతీతంగా అమలుచేస్తున్నారన్నారు. డ్వాక్రా సంఘాల రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టేలా రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు అందజేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, సర్పంచ్‌లు లక్ష్మి, పుష్పలత, ఎంపీడీవో సీతయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు అనూషదేవి, నేతలు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్ర మాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పి.యర్రగొండ సచివాలయం పరిధిలోని కోకితగొంది, వట్టిగడ్డ, వంకబూసి, పి.యర్రగొండ, పసరిగిన్ని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆయా గ్రామాల్లో 350 గడపలను ఆమె సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. పి.యర్రగొండ అంగనవాడీ కేంద్రంలో సీడీపీఓ దీప్తి అధ్యక్షతన నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం 22 మంది పిల్లలకు అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. దేవరమడుగుల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు బహూకరించిన సర్పంచ్ ముత్యాల నూకరాజును సన్మానించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీలు విశ్వమ్మ, జోగిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, సర్పంచ్ రాజేశ్వరి, నాయకులు త్రిమూర్తులు, తమ్మిరెడ్డి, భారతిబాబు, బాబి,కుమార్, కనకరాజు, నూకరాజు, తిరుపతిరెడ్డి, బాబూరావు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఏపీవో ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు



రైతులతో మాట్లాడుతున్న వికాస సంస్థ ప్రతినిధులు

డుంబ్రిగుడ: అరమ పంచాయతీ పనసపుట్టు గ్రామంలో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో వికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాగునీటి పథకం పనితీరును మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన జట్టు సంస్థ ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. సంస్థ వ్యవస్థాపకుడు పారినాయుడు తదితరులు గిరిజన రైతులకు పలు సూచనలిచ్చారు.

టిప్పర్ బోల్తా



జి.మాడుగుల: ఎగురాపల్లిలో జియో టవర్ నిర్మాణానికి సోమ వారం పిక్క రాయిని తీసుకువెళుతున్న టిప్పర్ ప్రమాదవశాత్తు మార్గ మధ్యలో బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నాడునేడు పనులకు భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, ప్రజాప్రతినిధులు

గుంబ్రిగుడ: గుంటసీమ పంచాయతీ దొర్రగుడలో నాడు-నేడు ద్వారా చేపడుతున్న అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులకు సర్పంచ్ నాగేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: కరుదేవపాలెం, బలిజపాడు, కొండలింగంపర్తి గ్రామాల్లో పాఠశాలలో నాడు-నేడు ద్వారా చేపడుతున్న పనులకు జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి సోమవారం భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, గడువులోగా పూర్తి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ, వైస్. ఎంపీపీ రాజేశ్వరి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటరమణ, సర్పంచ్‌లు కాంతం, సూరిబాబు, మురళీకృష్ణ, నాగేశ్వరరావు, నాయకులు వీరబాబు, జాన్‌బాబు, రవి, తాతారావు, హెచ్‌ఎంలు అమ్మాజీ, రాజుబాబు, పాండురావు, పాఠశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్లు, రమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి



ఎదలోచలి గ్రామ సచివాయలంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

జి.మాడుగుల: పెదలోచలి గ్రామ సచివాలయాన్ని రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి సోమవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సిబ్బంది పూర్తిస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. సకాలంలో వినతులు పరిష్కరించాలని సూచించారు.

రాజ్‌మా, మినుము విత్తనాల పంపిణీ



రైతులకు మినుము విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అమల, సర్పంచ్ కన్నారావులు

పెదబయలు: గోమంగి, కిముడుపల్లి పంచాయతీల్లో ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన రాజ్‌మా విత్తనాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గంజాయి నిర్మూలనకు గిరిజనులు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఏవో శ్రీనివాస్, సర్పంచ్ శోభారాణి, నాయకులు సత్తిబాబు, తమ్మన్న, భగీరథరావు, బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక ఆర్‌బీకేలో ఎంపీపీ అమల, సర్పంచ్ కన్నారావు, ఏవో కృష్ణకాంత్ తదితరులు రైతులకు మినుము విత్తనాలు పంపిణీ చేశారు. ఈనెల 29వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు.

రాజవొమ్మంగి: జడ్డంగి ఆర్‌బీకేలో రైతులకు మినుము విత్తన కిట్‌లను ఏవో రమేష్‌నాయుడు అందజేశారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ బొడ్డు వెంకటరమణ, సర్పంచ్ మురళీకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యను సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు



ఎంపీపీ శెట్టి నీలవేణిని సత్కరిస్తున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది



ఎంపీపీ కుమారికి అభినందనలు తెలుపుతున్న ఎంపీడీవో ఉమామహేష్ తదితరులు

చింతపల్లి రూరల్: జిల్లా ప్రాదేశిక సభ్యులుగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన నేపథ్యంలో విశాఖ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో చింతపల్లి జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యను డిప్యూటీ ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖా మంత్రి బూడి ముత్యాల నాయుడు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు, అనకాపల్లి ఎంపీలు మాధవి, సత్యవతి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై నిత్యం పనిచేస్తూ మంచి పేరు తీసుకురావాలన్నారు.

గూడెం కొత్తవీధి : జిల్లా ప్రాదేశిక సభ్యులుగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో విజయోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జీకే వీధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేష్ తదితరులు ఎంపీపీ బోయిన కుమారిని అభినందించారు. సర్పంచ్‌లు సుభద్ర, కాసులమ్మ, ఎంపీటీసీ సభ్యులు రాజేశ్వరి, సరస్వతి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, కో-ఆప్షన్ సభ్యుడు దావూదు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. నమోస్తుతే



గరగలతో ఊరేగింపుగా వెళ్తున్న కొయ్యూరు భవానీ మాలధారణ భక్తులు



పవనగిరి క్షేత్రంలో బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

సాక్షి,పాడేరు/కొయ్యూరు/జి.మాడుగుల/పెదబయలు/గంగవరం: దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలు విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబయ్యాయి.బాలా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అమ్మవారి భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు భవానీ మాలధారణ స్వీకరించారు. పాడేరు, కొయ్యూరు, పెదబయలు, జి.మాడుగుల, గంగవరం తదితర ప్రాంతాల్లో దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

క్రీడల్లో ప్రతిభచాటిన ఉద్యోగులకు అభినందనలు



ఉద్యోగులతో ఎంపీడీవో శ్రీహర్షిత్

అనంతగిరి: ఆల్ ఇండియా సివిల్ సర్వీస్, స్పోర్ట్స్ అథారిటీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పాడేరులో ఈనెల 21, 22న జరిగిన జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో మండలానికి చెందిన రొంపల్లి సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కొర్రా గోపీ, 10, 5కె పరుగు పందెంలోని ప్రథమస్థానం నిలిచాడు. గుమ్మకోట సచివాలయం మహిళ పోలీస్ మేఘన భారతీ వాలీబాల్, కబడీ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. వీరిని మండల కేంద్రంలోని సోమవారం ఎంపీడీవో శ్రీహర్షిత్ అభినందించారు. గుంటూరు, విజయవాడలో 27 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు.

350 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరానికి వచ్చిన గ్రామస్తులు

వై.రామవరం: మన ఊరు-మన పోలీసు కార్యక్రమంలో బాగంగా స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వై.రామవరం పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 350 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు, భోజనం అందజేసినట్టు ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ చెప్పారు. సీఐ వై.రాంబాబు, సిఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు నాయుడు, ఎంపీపీ ఆనందరావు, వైస్ ఎంపీపీలు జోగిరెడ్డి, విశ్వమ్మ, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ నూకరాజు ప్రారంభించారు. డాక్టర్లు రాహుల్, సుదర్శన్ వైద్య సేవలందించారు.

సారా బట్టీలపై దాడులు



పులుపును ధ్వంసం చేస్తున్న సిబ్బంది

కొయ్యూరు: ఆడాకుల పంచాయతీ రామ్‌నగర్ సమీపంలో సారా తయారీ అవుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్‌ఐ రాజారావు ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్నారు. సారా తయారీ ప్రాంతాన్ని కనుగొన్నారు. సారా పులుపును, బట్టీలను ధ్వంసం చేశారు. ఎస్‌ఐ రాజారావు మాట్లాడుతూ సారా తయారుచేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దాడుల్లో సిబ్బంది ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఆర్‌బీకే, సచివాలయం



ఆర్‌బీకే భవనాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాజవొమ్మంగి: అమీనాబాద్ గ్రామంలో సచివాలయం, రైతు భరోసా భవననిర్మాణాలు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నారు. ఈ భవనాలను సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. ఆర్‌బీకే ఎదుట గ్రావెల్ పరచి ఎత్తు పల్లాలు లేకుండా చూడాలని ఎంపీడీవో బాపన్నదొర అధికారులను సూచించారు. సమీపంలోని కాలువపై కల్వర్టు నిర్మాణానికి ఎస్టిమేషన్లు వేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, సర్పంచ్ వెంకటలక్ష్మి, తాతారావు, రవికుమార్, వీరబాబు తదితరులున్నారు.

గ్రామస్తులకు అవగాహన

ముంచంగిపుట్టు: కుమడ వెళ్లే మార్గంలో ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు ట్రాఫిక్ నిబంధనలపై వాహనచోదకులకు అవగాహన కల్పించారు.

నేడు, రేపు గ్రామాల్లో ఎమ్మెల్యేల పర్యటన

గూడెంకొత్తవీధి : మండలంలోని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఈ నెల 27, 28వ తేదీల్లో పర్యటించనున్నారని ఎంపీడీవో ఉమామహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు నగదు పంపిణీ తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

దేవీపట్నం: రంపచోడవరం, దేవీపట్నం మండలాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మంగళవారం పర్యటించనున్నట్టు పార్టీ వర్గీయులు తెలపారు. రంపచోడవరం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు రంపచోడవరం, మారేడుమిల్లి , దేవీపట్నం మండలాలకు సంబంధించిన వైఎస్సార్ చేయూత లబ్ధిదారులకు సొమ్ము పంపిణీ చేస్తారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు దేవీపట్నం మండలం వి.రామన్నపాలెంలో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

గంగవరం: మొల్లేరు సచివాలయ పరిధిలోని వడ్డిచెరువు, ఆర్డీపురం గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బి.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొని, గ్రామాల్లో పర్యటిస్తారని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.

ఎన్‌ఆర్‌ఎస్‌టీసీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

చింతూరు /వీఆర్ పురం: చింతూరు, వీర్ పురం మండలాల్లోనాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ)లలో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంఈవో లక్ష్మినారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతూరు మండలంలో ఆరు పోస్టులు, వీఆర్ పురం మండలంలోని 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, బి ఈడీ, డి ఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, ఈ నెల 28లోగా దరఖాస్తులను ఎంఈవో కార్యాలయాల్లో అందజేయాలని పేర్కొన్నారు.

పాములపుట్టులో పశువైద్య శిబిరం

డుంబ్రిగుడ: కితలంగి పంచాయతీ పాములపుట్టు గ్రామంలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 160 పశువులు, 230 మేకలకు టీకాలు వేసినట్టు పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ చెప్పారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కూనవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. కోరం లేకపోవడంతో ప్రగతి నివేదికలకు సంబంధించిన తీర్మానాలు ఆమోదించడం సాధ్యపడలేదు. ఎనిమిది మంది సభ్యులకు గాను ఎంపీపీతో పాటు నలుగురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. కాచవరం, పోచవరం, టేకుబాక, అబిచర్ల పంచాయతీలను 41 కాంటూర్‌లో చేర్చాలని పలువురు సభ్యులు బైఠాయించారు. ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ విజయతో పాటు ఎంపీడీవో ప్రేమసాగర్, తహసీల్దార్ కె.అనసూయలు సర్దిచెప్పడంతో నిరసనను విరమించారు. తహసీల్దార్ అనసూయ మాట్లాడుతూ వీఆర్ పురంలో నిర్వహిస్తున్న భూ సర్వే అనంతరం కూనవరం మండలంలో 9 గ్రామాల్లో ల్యాండ్ ఎక్విజేషన్ సర్వే చేపడతామన్నారు. ఎంపీటీసీలు అనంతలక్ష్మి, వెంకటేశ్వరరావు, నాగరాణి, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జంగిల్ క్లియరెన్స్



జంగిల్ క్లియరెన్స్ పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ షరీఫ్

రాజవొమ్మంగి: జడ్డంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిన పొదలను, తుప్పలను పోలీసులు తొలగింపు పనులు చేపట్టారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించేలా చర్యలు తీసుకున్నారు. ఎస్‌ఐ షరీఫ్ తదితరులున్నారు. వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాధ రుసుం వసూలు చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

దేవీపట్నం: పెదభీంపల్లి కాలనీలోఎస్‌ఐ నాగార్జున ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. వాహనచోదకులు తప్పనిసరిగా లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. అనంతరం గ్రామస్తులకు ఆన్‌లైన్ మోసాలను వివరించి, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరం వారపు సంతలో సోమ వారం సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అదనపు పోలీసు బలగాల ఆధ్వర్యంలో సుమారు 185 మంది పేదలకు భోజనం, వాటర్ ప్యాకెట్లు అందజేశారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటమణ తదితరులు పాల్గొన్నారు.